కొట్టుకు పోతున్న కాజ్‌వేలు..

- తాత్కాలిక చర్యలు వద్దు
- శాశ్వత పరిష్కారం చూపండి
- రైతుల ఆవేదన


వరద నీరు ప్రవహిస్తుండటంతో కొట్టుకు పోతున్న కాజ్‌వే

కమలాపురం : వరదలు వచ్చినప్పుడల్లా కాజ్‌వేలు కొట్టుకు పోతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు చేపడుతున్న తాత్కాలిక చర్యలు వద్దని, హైలెవెల్ వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కమలాపురం–ఖాజీపేట, చాపాడు మండలాలకు వారధిగా పెన్నా నదిపై ఉన్న లో లెవెల్ కాజ్‌వే, కమలాపురం మండలం సి.గోపులాపురం–పాచికలపాడు గ్రామాల మధ్య ఉన్న వంకపై నిర్మించి చిన్నపాటి వంతెన ప్రతి సారి వరదలు వచ్చినప్పుడల్లా కొట్టుకు పోతున్నాయని ఆయా మండలాల రైతులు గంగిరెడ్డి, ఖాదర్ హుస్సేన్, రెడ్డయ్య, మస్తానయ్య, సాదక్ తదితరులు కోరుతున్నారు. కమలాపురం మండలం గంగవరం గ్రామానికి చెందిన చాలా మంది రైతులకు సంబంధించిన పొలాలు పెన్నానదికి ఆవతల ఉన్న రంగ నాయకుల తువ్వ, వెదురూరు, రాజుపాళెం తదితర గ్రామాలలో ఉన్నాయి. ఈ రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే పెన్నా నదిపై ఉన్న లో లెవెల్ వంతెన దాటి వెళ్లాల్సిందే. రైతులు కమలాపురం నుంచి ఈ వంతెన గుండా వెళ్తే కేవలం 5 కి.మీ. దూరంలో పొలాలకు చేరుకోవచ్చు. కానీ వరదలు వచ్చినప్పుడు మాత్రం రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే ఏటూరు, మిడుతూరు, వెదురూరు దాటుకుని రంగ నాయకుల తువ్వకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో పొలాలకు చేరుకోవాలంటే 15 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అలాగే ఖాజీపేట, చాపాడు మండలాలకు చెందిన ఏటూ రు, మిడుతూరు, వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం, నక్కలదిన్నె గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం కమలాపురం వస్తుంటారు. వారంతా ఈ వంతెన ద్వారానే తమ ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. అయితే ఈ వరదల వలన వంతెన కొట్టుకుపోతే మాత్రం వారికి ఇబ్బందులు తప్పవు.

వరదలు వస్తే కొట్టుకు పోవడమే

ప్రతి సారి వరదలు వచ్చినప్పుడల్లా కమలాపురం మండలం గంగవరం–ఖాజీపేట మండల రంగనాయకుల తువ్వ మధ్య పెన్నా నదిపై ఉన్న లో లెవెల్ వంతెన కొట్టుకు పోవడం జరుగుతోంది. ఇప్పటికే ఈ వంతెనకు లక్షల ఖర్చు చేసి పలుమార్లు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేసినప్పటికి వరదలు వస్తే తిరిగి కొట్టుకు పోవడం ఖాయం. దీంతో మరమ్మతులకు చేపట్టిన నిధులన్నీ వృథా అవుతున్నాయని, వాటి బదులు హై లెవెల్ వంతెన నిర్మించి తమకు శాశ్వత పరిష్కారం చూపండని రైతులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపండి



పొలాలకు వెళ్లాలంటే పెన్నా నదిపై ఉన్న లో లెవెల్ వంతెన పై వెళ్లే వాళ్లం. పెన్నా నదికి వరద నీరు రావడంతో వంతెన కొట్టుకు పోయింది. దీంతో 15 కి.మీ. ప్రయాణించి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–ఖాదర్ హుసేన్, రైతు, కమలాపురం

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



తమకు ఏమి కావాలన్నా కమలాపురంకు వెళ్తాం. పెన్నా నదిపై ఉన్న కాజ్ వే కొట్టుకు పోవడం సర్వ సాధారణం అయింది. కాజ్ వే కొట్టుకు పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అన్ని గ్రామాలు తిరిగి కమలాపురం రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఇన్ని గ్రామాలను కలిపే కాజ్ వే స్థానంలో హై లెవెల్ వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలి.

–రెడ్డయ్య, వెదురూరు, చాపాడు మండలం

శ్రీరాంనగర్‌లో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలి

వేంపల్లె : శ్రీరాంనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్యం చాలా అధ్వానంగా ఉందని అధికారులు పట్టించుకోకపోవడం చాలా దారుణమని మాజీ వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ నేత గాతాల శ్రీను పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా శ్రీరాంనగర్‌లో ఎక్కడ చూసిన డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయక పోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో అ ప్రాంత ప్రజలు అందరూ రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. తాగునీటికి చెందిన పైపులు లీక్ కావడంతో నీరు వృథాగా పోతున్నట్లు తెలిపారు. తాగునీటికి చెందిన పైపులు లీక్ కావడంతో పై ప్రాంతాలకు తాగునీటి సమస్య కూడా ఉందన్నారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

గంటికోటలో పర్యాటక దినోత్సవం జరపాలి

కడప సెవెన్‌రోడ్స్: గండికోటలో సెప్టెంబరు 2న రాష్ట్రస్థాయి పర్యాటక దినోత్సవం నిర్వహించాలని తాళపత్ర గ్రంథలిపి నిపుణులు నాగదాసరి మునికుమార్ కోరారు. ఏపీ ప్రభుత్వం ఇందుకోసం ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి, సీఈఓలకు డిజిటల్ వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకొన్నారు. దైవ దర్శనాంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వైద్య నాధీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరపునాయునిపల్లె : మండలంలోని గోనుమాకులపల్లెలో ఆదివారం సాయంత్రం 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ మంజునాథ్ తెలిపారు. గోనుమాకులపల్లెకు చెందిన రామకృష్ణ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పరామర్శ


శివశంకర్ నాయుడిని పరామర్శిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక వెంకటాపురం గ్రామంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు సమీప బంధువు శివశంకర్ నాయుడు ఇటీవలి ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా ఆదివారం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డిలు అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. వీరితో పాటు ఆంజనేయులు నాయుడు, కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఎన్‌ఎంయూ పోరాడుతోంది


మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ నాయకుడు

జమ్మలమడుగు : ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం ఎన్‌ఎంయూ చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.శివారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎన్‌ఎంయూ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. కడప రిజనల్ సెక్రటరీగా సుధాకర్, డిపో అధ్యక్షుడిగా పి.బ్రహ్మం, వైస్ ప్రెసిడెంట్‌గా రవిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాంతయ్య, డిపో కార్యదర్శిగా ఓబుళరెడ్డి, డిపో అడిషనల్ కార్యదర్శిగా నాగేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ శేషన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

దూదేకుల వర్గీయులకు దక్కని ఫలాలు

కడప రూరల్: దూదేకుల వర్గీయులకు ఎంపీ, ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఏపీ నూర్‌బాషా ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దన్న అన్నారు. స్థానిక వైయస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్రం లభించినప్పటినుంచి నేటి వరకూ దూదేకుల వర్గీయులకు రాజ్యాంగ ఫలాలు దక్కలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది దూదేకుల సోదరులున్నా, ఒక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ కానీ లేకపోవడం బాధాకరమన్నారు. 2024 లో నారా లోకేష్ అనేక హామీలిచ్చి మాట తప్పారని ఆరోపించారు. అనంతరం జిల్లా దూదేకుల పొలిటికల్ జేఏసీ కార్యర్గాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా అధ్యక్షుడిగా నాగూరు కుళ్లాయప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సరిటాల పక్రుద్దీన్, యూత్ అధ్యక్షుడిగా బాబాహుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా చింతకుంటబాబు, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్, మస్తాన్, సిద్దయ్య, బెల్లంకొండ దస్తగిరి, కుళ్లాయప్ప, కార్యదర్శులుగా దుర్గం సుభాన్ అలీ, బాషా, రాయపాటి దస్తగిరిలను ఎన్నుకున్నారు.

సైక్లింగ్ అలవాటు ఆరోగ్యకరం


పులివెందులలో సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్ : ప్రతి వ్యక్తి సైక్లింగ్ అలవాటు చేసుకుంటే అది ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుందని డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన ఫిట్నెస్ క దోస్త్ ఆంధ్ర అవర్ హెయిర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పోలీసులు సిబ్బందికి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద నుంచి పూలంగళ్లు, పాత బస్టాండ్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు సైకిల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు రమణ, హాజీవల్లీ, ఎస్‌ఐ నారాయణ పోలీసులు పాల్గొన్నారు.


జమ్మలమడుగులో సైక్లింగ్ చేస్తున్న పోలీసు బృందం

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రతి వ్యక్తి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం కచ్చితంగా సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్ ఆఫీసర్‌లతో కలసి ఆయన సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పోలీసులు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు ఒక గంట సైక్లింగ్ చేయాలన్నారు. దానితో పాటు ప్రశాంతత కలిగి ఉండాలన్నారు. సైక్లింగ్ వలన శరీరంలో రక్తప్రసరణ జరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సీఐలు నరేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, మహిళ ఎస్‌ఐ హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు కృషి చేస్తా


డి.చంద్రశేఖర్‌రావు

జమ్మలమడుగు రూరల్ : ప్రధానోపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేస్తానని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర రావు తెలిపారు. ఆదివారం డీసీఈబీ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలలో జమ్మలమడుగు మండల విద్యా శాఖాధికారి–2 చంద్రశేఖరరావు రెండవ సారి జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. జిల్లా అధ్యక్షుడుగా జి.వి. సుబ్బారెడి, కోశాధికారిగా బి.శ్రీనివాస్‌రెడ్డి, జమ్మలమడుగు ఉపాధ్యక్షుడు వి. సూర్యనారాయణరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ జి.బాలయ్య, రాష్ట్ర కౌన్సిలరు ఎన్.లక్ష్మీ నారాయణరెడ్డి తదితరులను ఎన్నుకోన్నారు.

పేద బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : పేద బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు కోరారు. నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయం ఆవరణలో ఆదివారం బ్రాహ్మణ సమ్మేళనం జరిపారు. చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రఘునాథరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తమ కుటుంబాల్లో పలువురికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందలేదన్నారు. ఇంటి స్థలాలు, సొంత ఇల్లు లేక ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీలకు గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, ప్రసాద్, పిడతల గోపాలకృష్ణ, చంద్రమౌళిశర్మ, చిత్రపు హనుమంతరావు, తిరుపతి అనంత కుమార్, సుబ్బారావు, నరేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు


ట్రాఫిక్ రూల్స్ వివరిస్తున్న సీఐ నరసింహులు

వేంపల్లె : ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని వేంపల్లె సీఐ టి.నరసింహులు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పలుచోట్ల ట్రాఫిక్ నిభందనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా సీఐ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మద్యం సేవించి నడపడం, మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

తవ్వారు.. ప్రమాదకరంగా వదిలేశారు


ప్రమాదకరంగా వదిలివేసిన రహదారి

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్ నూతన ప్రధాన రహదారిలో అటవీశాఖ కార్యాలయం వద్ద తాగునీటి సరఫరాల కోసం రోడ్డును పగలగొట్టారు. పని పూరై్తయి నెలలు గడిచినా తిరిగి రహదారిని పునరుద్ధరణ చేయలేదు. తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు పూరై్తనా ఈ వాల్వ్ వద్ద పైప్‌లైన్ లీకేజీ కొనసాగుతోంది. దీంతో నీరంతా నిల్వచేరింది. దీనికి తోడు ప్రధాన రహదారిలో రహదారి పునరుద్దరణ చేపట్టకుండా వదిలివేయడం, పైప్‌లైన్ లీకేజీతోపాటు వాల్వ్ తెరచి వుండటంతో ఈ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం ఏొటుచేసుకుంది. నిత్యం భారీ వాహనాలు వెళ్లే ఈ రోడ్డులో ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగులపై ప్రభుత్వానికి కనికరం లేదు

కడప కార్పొరేషన్: దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని, మనసు, మానవత్వం లేకుండా కర్కశంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివరామ్ పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొత్త పింఛన్ మంజూరు చేయకపో షరతులు పెట్టి దివ్యాంగ పింఛన్ దారులను ఆస్పత్రుల చుట్టూ తిప్పుతూ వచ్చారన్నారు. ఇప్పుడు లక్ష మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసి రోడ్లపాలు చేశారని ధ్వజమెత్తారు. ఈనెల 25వ తేది కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కె.శివ యాదవ్, వెంకటసుబ్బయ్య, సురేంద్ర, శివ పాల్గొన్నారు.

మైనార్టీలకు అన్యాయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీజేపీ పాలనతో మైనార్టీలకు అన్యాయం జరిగిందని ఏపీసీసీ కో–ఆర్డినేటర్ సత్తార్ అన్నారు. నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు నష్టం కలిగించే బిల్లులు ఉభయ సభల్లో ప్రవేశపెడితే అన్ని కూటమి ఎంపీలు మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ఉభయ సభల్లో ప్రవేశపెట్టినపుడు వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆ బిల్లుకు మద్దతుగా ఓటు వేయలేదన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం


తాగునీటి ఫిల్టర్లను పరిశీలిస్తున్న సర్పంచ్

వేంపల్లె : పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక పాపాఘ్ని నదిలో వేస్తున్న తాగునీటి ఫిల్టర్లను ఆయన పరిశీలించారు. దిబ్బతిన్న మోటర్లు స్థానంలో కొత్త మోటర్లను బిగించి సకాలంలో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వీధికి పాపాఘ్ని నది నీటిని సరఫరా చేసేందుకు నదిలో ఫీటర్లును వేసినట్లు తెలిపారు. ఆయన వెంట వైసీపీ నేతలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ఆత్మహత్యపై విచారించాలి

కడప ఎడ్యుకేషన్ : వేంపల్లి మండలం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో జరిగిన ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి కారణాలపై న్యాయవిచారణ జరిపించాలని ఆర్‌ఎస్‌యూ కడప నగర అధ్యక్షుడు గురుమోహన్ డిమాండ్ చేశారు. కడప ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ నెల కిందట భోజనంలో పురుగులు రావడంపై విద్యార్థులు అక్కడ ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. సమస్య పరిష్కరించకపోగా కళాశాల సిబ్బంది నిర్లక్ష్యంతో నరసింహనాయుడు బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. లేదంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, రాఘవ, ముజబత్‌బాషా, జశ్వంత్, కిరణ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మహాధర్నాకు తరలిన ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి అభ్యర్థులు తరలివెళ్లారు. ఆదివారం సాయంత్రం కడప ఎన్‌జీవో భవన్ నుంచి 2003 డీఎస్సీ రాష్ట్ర ఫోరం జిల్లా కన్వీనర్లు గుజ్జల తిరుపాల్, కావేటి ఉదయ్‌బాస్కర్ ఆధ్వర్యంలో వంద మందికిపైగా అభ్యర్థులు బస్సు, ట్రైన్, సొంత వాహనాల్లో వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరు శివారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, డీఎస్సీ ఫోరం కన్వీనర్లు కురకూటి సుధాకర్, మిద్దె ప్రవీణ్ కిరణ్, బండి నాగేశ్వరెడ్డి, కందకూరు వీరప్రతాప్, బసిరెడ్డి శోభారాణి, కటుబత్తుల సునీత జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

మోతాదుకు మించి ఎరువులను వాడరాదు


పెద్దచెప్పలిలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి, ఎస్‌ఐ విద్యా సాగర్

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంటలకు సరిపడ ఎరువులను మాత్రామే వాడాలని, మోతాదుకు మించి ఎరువులను వాడరాదని ఏఓ సరస్వతి తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్ద చెప్పలి గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఆమె ఎస్‌ఐ విద్యాసాగర్, విజిలెన్స్ పీసీ సుధాకర్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. నిల్వ ఉన్న ఎరువులను, స్టాక్ రిజిష్టర్, బిల్ బుక్స్ తో సరిపోల్చి చూశారు. ఎరువుల నిల్వ, ధరల పట్టికను ప్రతి రోజు అప్‌డేట్ చేసి ప్రదర్శించాలన్నారు. ఎరువులను కొన్న రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణాదారులకు సూచించారు. రైతులు కూడా బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటలకు సరిపడ ఎరువులను వాడాలన్నారు. యూరియా కొరత లేదని, ఎవరైన కృత్రిమ కొరత సృష్టితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్, విజిలెన్స్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు అభినందనీయం


తిరుమలరెడ్డిని సత్కరిస్తున్న మానవత సంస్థ చైర్మన్

పులివెందుల టౌన్ : స్థానిక డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పులివెందుల పట్టణ, పరిసర గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డీవీ కొండారెడ్డి పేర్కొన్నారు. మొయిల్లచెరువు గ్రామస్తులు కంభం తిరుమలరెడ్డి, వారి ధర్మపత్ని రామలక్షుమ్మల జ్ఞాపకార్థం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు చెన్నై శంకర నేత్రాలయం వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలను మూడు సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం తిరుమలరెడ్డిని శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో మానవతా కన్వీనర్ శ్రీకృష్ణారెడ్డి, ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రటరీ ఎం.వి. శేషయ్య, కోశాధికారి బండి హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు చేరి.. కుంటలా మారి


మురికి కుంటలా మారిన కనంపల్లె ప్రధాన రహదారి

పులివెందుల రూరల్ : మండలంలోని కనంపల్లె గ్రామం ప్రధాన రహదారిలో మురుగునీరు పొంగి నివాసాలకు సమీపంలో గుంటలుగా మారింది. దీనికి తోడు వర్షానికి మీరు చేరి మడుగులా తయారైంది. దీంతో దోమల వృద్ధి చెంది విష జ్వరాలు ప్రజలకు ప్రబలే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వస్తుండటంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పైన మురుగురు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

స్వయం ఉపాధి వైపు నడిపించడమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: విద్యార్థినులను స్వయం ఉపాధి వైపు నడిపించడమే లక్ష్యమని రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. కడప రాజీవ్‌పార్కురోడ్డులోని రెడ్డి సేవా సమితి భవనంలో ఆదివారం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, గ్రంథాలయాలను ఆయ ప్రారంభించారు. లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ ఈ కేంద్రం నిర్వహణకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కంభం నిత్యానందరెడ్డి, డైరెక్టర్ పి శరత్‌చంద్రారెడ్డి ఆర్థిక సహకారం అందించారని తెలిపారు.

భారీగా తరలిన వినాయక విగ్రహాలు


ట్రాక్టర్‌లో వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాలకు వినాయకుడి విగ్రహాలను భారీగా తరలించారు. ఆదివారం పట్టణంలో వినాయక విగ్రహాలను కోనుగోలు చేసి ట్రాక్టర్లలో డప్పు వాయిద్యాలతో తీసుకెళ్లడం జరిగింది. ఈ ఏడాది గ్రామాల్లో పెద్ద స్థాయిలో విగ్రహాలను కూర్చోబెట్టడానికి భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో జమ్మలమడుగులో పండుగ సందడి నెలకొంది.